క్లుప్తంగా

రాముల వారి అక్షింతల పంపిణీ


అక్షింతలు అందజేస్తున్న సర్పంచ్

నేరడిగొండ: అయోధ్య రాముల వారి అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని మండల కేంద్రంలో చేపట్టారు. ఆదివారం విశ్వహిందూ పరిషత్ సభ్యులు, గ్రామస్తులు ఇంటింటికీ వెళ్లి అక్షింతలు అందజేశారు. ముందుగా హనుమాన్ ఆలయం వద్ద పూజలు చేసిన అనంతరం గడప గడపకు వెళ్లి ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంట వెంకట రమణ గ్రామస్తులు శ్రీకర్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


ఆర్థికసాయం చేస్తున్న సభ్యులు

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మివాడకు చెందిన బండారు రమేశ్ ఇటీవల గుండె సంబంధిత వ్యాధితో మృతి చెందారు. బాధిత కుటుంబానికి మార్నింగ్ వాకర్స్ మిత్రబృందం సభ్యులు అండగా నిలిచారు. రూ. 18000 ఆర్థిక సాయం కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కనుకుంట్ల రామచందర్, పెరక గంగయ్య, గంపల ప్రభాకర్, మూగ శభాష్ ప్రకాష, సంతోష్, వెంకన్న, పులి నగేశ్, బండాజ ఈశ్వర్ పాల్గొన్నారు.

పరామర్శ

తలమడుగు: మండలంలోని ఝరి గ్రామానికి చెందిన సీడం మహేష్ మాతృమూర్తి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులను కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్, జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి పరామర్శించారు. అలాగే మాచర్ల భగీర్థబాయి మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, వైస్ ఎంపీపీ దివ్య మాధవ్, సర్పంచ్ రఘు, తేజాపూర్ సర్పంచ్ ప్రవుల్ రెడ్డి, వెంకన్న యాదవ్, విలాస్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని ఖండిపల్లే గ్రామానికి చెందిన నిర్మల్ డిప్యూటీ కలెక్టర్ రాథోడ్ మోహన్ సింగ్ కూతురు ఇటీవల మృతి చెందడంతో మాజీ ఎంపీ నగేశ్ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ధన్నూర్ గ్రామానికి చెందిన పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు సదాశివ్ నానమ్మ ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని సైతం పరామర్శించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్సై

తాంసి: గత ఏడాది మహారాష్ట్ర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైభవ్ యాదవ్, షేక్ సల్మాన్‌ల జ్ఞాపకార్థం అర్లి(టి) గ్రామంలో చైతన్య యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆదివారం భీంపూర్ ఎస్సై లాల్ సింగ్ నాయక్ ప్రారంభించారు. మృతిచెందిన యువకుల చిత్రపటాలకు నివాళులర్పించారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు ప్రథమ బహుమతిగా రూ. 25వేలు, రెండో బహుమతి రూ. 12వేలు, మూడో బహుమతి రూ. 7,500, నాలుగో బహుమతి రూ. 5వేలు నగదు అందజేస్తామని టేకాం దిలీప్, లసమన్న యాదవ్, రామన్న యాదవ్, రాకేష్ మాధవ్ తెలిపారు. కార్యక్రమంలో మాదస్తు సురేందర్, నితిన్, రామన్న, రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండే జీవనాధారం


బజ్జీలు విక్రయిస్తున్న కోల నారమ్మ

నేరడిగొండ: మండల కేంద్రానికి చెందిన కోల నారమ్మ కుటుంబానికి తోపుడు జీవనాధారంగా మారింది. గత 46 సంవత్సరాల నుంచి నారమ్మ మండల కేంద్రంలో తోపుడు బండిపై బజ్జీలు అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఇదిలా ఉండగా.. 30 సంవత్సరాల క్రితం ఆమె భర్త, 15 ఏళ్ల క్రితం కుమారుడు సైతం మరణించారు. ఈ వయస్సులోనూ పొట్టకూటి కోసం ప్రతిరోజు బజ్జీలు అమ్ముతూ తన కోడలు, ఒక మనుమడు, ఇద్దరు మనుమరాళ్లను బాగా చూసుకుంటోంది.

ఆస్తి కోసం హత్యలు..

- మంటగలుస్తున్న మానవ సంబంధాలు
- కుటుంబసభ్యుల మధ్య ఆస్తి గొడవలు
- రోడ్డున పడుతున్న కుటుంబాలు

ఇచ్చోడ: భూవివాదాలు, ఆర్థిక లావాదేవీలు పచ్చని కుటుంబాల్లో చిచ్చు పెడుతున్నాయి. ఆస్తుల కోసం కుటుంబ సంబంధాలను సైతం తెంచుకుంటున్నారు. అన్నదమ్ములు రక్త సంబధాన్ని మరిచి పరస్పర దాడులు, హత్యలకు పాల్పడుతున్నారు. గతంలో అన్నదమ్ములు, దాయాదులు మధ్య భూతగాదాలను బంధువులు, గ్రామపెద్దలు పరిష్కరించే వారు. డబ్బుపై ఆశ, కుటుంబసభ్యుల మధ్య సఖ్యత లేక పోవడం, న్యాయస్థానాల్లో కేసులు వేయడం, ఆర్థిక అవసరాల కారణంగా హత్యలు, హత్యయత్నాలు జరుగుతున్నాయి. ఫలితంగా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

పెరిగిన ధరల కారణంగా..

పదేళ్ల కిందట గ్రామీణ ప్రాంతాల్లో భూముల ధరలు తక్కువగా ఉండేవి. గత పదిసంవత్సరాల నుంచి భూముల ధరలకు అమాంతంగా రెక్కలు వచ్చాయి. గ్రామీణ ప్రాంతలు కొండలు గుట్టలు, ఎలాంటి నీటి వసతి లేని చోట కూడా ఎకరానికి రూ. 10 లక్షలకు పైగానే పలుకుతోంది. మండల, జిల్లా కేంద్రాల్లో లకు సమీపంలోని భూములు ఎకరానికి కోటికి పైగానే ధర ఉంది. భూముల పంపకాల్లో తేడాలు, ఆస్తి గొడవలు, కోర్టు కేసులు పరిష్కారానికి నోచుకోకపోవడంతో హత్యలు, హత్యయత్నాలకు దారి తీస్తున్నాయి.

కేసులన్నీ భూములవే..

గత పదేళ్లుగా జిల్లా వ్యాప్తంగా పోలీస్‌స్టేషన్‌లో ఎక్కువగా నమోదువుతున్న కేసులన్నీ భూములకు సంబంధించినవే. ప్రధానంగా మండల కేంద్రాలకు, రహదారులకు దగ్గరలో ఉన్న నీటి లభ్యత ఉన్న భూములు ఎకరానికి రూ. 20 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ధరలు పెరగడంతో కుటుంబాల్లో, అన్నదమ్ములకు గొడవలు జరుగుతున్నాయి. వాటాల విషయంలో విభేదాలు వచ్చి హత్యలకు దారి తీస్తున్నాయి. కుటుంబాల మధ్య పంచాయతీలు, ఘర్షణలతో పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదవుతున్నాయి.



భూవివాదంలో అన్న కుమారుడిని హత్య చేసిన నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు (ఫైల్)

క్షణికావేశంలో..



క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు అనార్థాలకు దారితీస్తాయి. మనోస్థైరం కోల్పోయినప్పుడు మిత్రులు కానీ కుటుంబసభ్యులతో చర్చించాలి. దీంతో మనిషిలో ఉన్న కోపం తగ్గుతుంది. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాల వల్ల ఇబ్బంది పడాల్సి వస్తుంది.

– ఓం ప్రకాశ్, సైక్రియాటిస్టు, రిమ్స్

న్యాయస్థానాలను ఆశ్రయించాలి



భూములు, ఆస్తి తగాదాలు ఉంటే నేరుగా కోర్టులను ఆశ్రయించాలి. కొంత ఆలస్యమైనప్పటికీ సరైన న్యాయం జరుగుతుంది. అంతేకానీ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం వల్ల కుటుంబాల మధ్య ఉన్న బంధాలు తెగిపోయి, రోడ్డున పడే అవకాశం ఉంది.

– సంగెం సుధీర్‌కుమార్, ప్రముఖ న్యాయవాది

మచ్చుకు కొన్ని ఘటనలు..

- ఇచ్చోడ మండలంలో సాథ్‌నంబర్ గ్రామంలో వానోలే పాండురంగ్, వానలే కేదోబ అన్నదమ్ములకు వారసత్వంగా వచ్చిన నాలుగు ఎకరాల భూమి ఉంది. ఈ భూమి 44వ జాతీయ రహదారికి ఆనుకొని ఉంది. గత సంవత్సరం పాండురంగ్‌కు తెలియకుండానే కేదోబ కుమారుడు ఈశ్వర్ వారి కుటుంబసభ్యుల పేర్లపై విరాసత్ ద్వారా పట్టా చేసుకున్నారు. దీంతో అన్నదమ్ముల మధ్య ఆస్తి వివాదం మొదలైంది. పాండురంగ్ ఆయన కుమారుడు ఇద్దరు కలిసి ఈశ్వర్‌ను కత్తులు, గొడ్డలితో దాడి చేసి హత్య చేశారు.
- బేల మండల కేంద్రానికి చెందిన అమూల్ వారి దాయాదుల మధ్య భూవివాదం ఉంది. అమూల్ దాయాదులు అమూల్‌ను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బస్టాండ్ సమీపంలో కత్తులతో దాడి చేసి దారుణంగా హత్య చేశారు.
- ఇచ్చోడ మండలంలో కేశవపట్నం గ్రామంలో ఇద్దరు అన్నదమ్ముల మధ్య ఆస్తి పంపకాల గొడవలు ఉన్నాయి. అన్నదమ్ములు రాడ్లు, కత్తులతో దాడులు చేసుకున్నారు. ఇద్దరిపై పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. గత నాలుగేళ్ల నుంచి కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు.
- ఇచ్చోడ మండలంలోని భాదిగూడలో పదే ఎకరాల భూమిలో దాయాదుల మధ్య ఆస్తి వివాదం ఉంది. పట్టా ఒక్కరిపై ఉంటే పహిణీలో పేరు మరొకరిపై ఉంది. దీంతో కాస్తు విషయలో గొడవలతో ఇరువర్గాల వారిపై కేసులు నమోదయ్యాయి.

బిందు సేద్యానికి దూరం


బోథ్ మండలంలోని మర్లపెల్లిలో నీటి తడిని అందిస్తున్న రైతు

- నిలిచిన పరికరాల సబ్సిడీ
- నాలుగేళ్లుగా రైతుల ఎదురుచూపు
- ఆరుతడి పంటల సాగులో ఇబ్బందులు

ఇచ్చోడ: తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేసేందుకు బిందు సేద్యం పథకాన్ని 2002లో అప్పటి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఆరుతడి పంటలు కూరగాయలు, పండ్ల తోటల పెంపకం చేపట్టిన రైతులకు సబ్సిడీపై ఏటా బిందు సేద్యం పరికారాలను అందజేసింది. వీటి కోసం అర్హులైన రైతులు దరఖాస్తులు చేసుకునే వారు సంవత్సరంలో ఒక్కసారి రైతులకు బిందుసేద్యం పరికారాలు ప్రభుత్వం అందచేసేది. కానీ 2020 నుంచి ప్రభుత్వం బిందు సేద్యం పరికారాలపై సబ్సిడీ విడుదల చేయక పోవడంతో రైతులు నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్నారు.

ఆరుతడి పంటలకు ప్రాధాన్యం..

బోథ్ నియోజకవర్గంలో ఇచ్చోడ, గుడిహత్నూర్, తాంసి, భీంపూర్, నేరడిగొండ, బజార్‌హత్నూర్, బోథ్ మండలాల్లో అధితకంగా రైతులు ఆరుతడి పంటలు సాగు చేస్తారు. రబీలో నువ్వు, సజ్జ, వేరుశనగ, శనగ, మెంతి, కొత్తిమిరతో పాటుగా కురగాయలు సాగు చేస్తారు. ఈపంటలకు బిందు సేద్యం ద్వారానే నీటితడులు అందిస్తారు. రైతుల ఆర్థిక పరిస్థితితో సంబధం లేకుండా ఐదు ఎకరాల లోపు భూములు ఉన్న రైతులకు బిందు సేద్యం పరికారాలను సబ్సిడీపై అందించాల్సి ఉంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీ, బీసీ రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 80 శాతం సబ్సిడీపై పరికరాలు అందచేయాలి.

నష్టపోతున్న రైతులు..

సబ్సిడీపై బిందు పరికరాల కోసం రైతులు నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నారు. 2020లో ప్రభుత్వ బిందుసేద్యం పరికరాలపై సబ్సిడీ నిలిపి వేసింది. దీంతో బిందు సేద్యం ఆధారంగా పంటలు పండించే రైతులు పరికరాల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. తక్కువ నీటి సామర్థ్యం ఉన్న రైతులు రబీలో పంటలు సాగు చేయక ఆర్థికంగా నష్టపోతున్నారు. కొత్త ప్రభుత్వం దృష్టి సారించి అన్నదాతలకు బిందుసేద్యం పరికరాలు అందించాలని రైతులు కోరుతున్నారు.

ఇతర పంటకు ఇవ్వడంలేదు

ప్రస్తుతం ప్రభుత్వం ఆయిల్‌పాం సాగుకే బిందుసేద్యం పరికరాలను అందచేస్తుంది. ఇతర పంటల సాగుకు బిందుసేద్యం పరికరాలు ఇవ్వడం లేదు. ఆరుతడి పంటల సాగు చేసే రైతులు బిందుసేద్యం పరికరాల కోసం కార్యాలయంలో సంప్రదిస్తున్నారు. కానీ ప్రభుత్వం నుంచి అనుమతులు లేవు.

– శ్రీనివాస్‌రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి

వైభవంగా గోదాదేవి కల్యాణం


తాంసి: నిపాని గ్రామంలో పూజలు చేస్తున్న భక్తులు

తలమడుగు: మండలంలోని బరంపూర్ కొండపైన ఉన్న శ్రీవేంకటేశ్వర ఆలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం, పూజ కార్యక్రమాలు చేపట్టారు. అర్లి, తలమడుగు, రుయ్యడి, కోత్తుర్ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కేదారేశ్వర్ రెడ్డి, భూమారెడ్డి, మల్లేష్, ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని గ్రామంలోని వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య గ్రామస్తుల సమక్షంలో నిర్వహించారు. వేద పండితులు నేరేళ్ల కల్యాణచారి, పరమేశ్వరయ్య ఆధ్వర్యంలో హోమం, అర్చన, చతుర్చాచన, గోదాదేవి కల్యాణాన్ని కన్నుల పండువగా జరిపించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు శివ దత్తగిరి మహారాజ్, సర్పంచ్ రాజన్న, ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగాధర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.


తలమడుగు: కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

నూతన కార్యవర్గం

ఉట్నూర్‌రూరల్: అంబేద్కర్ ఆశయసాధన కార్యవర్గాన్ని ఆదివారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బిరుదుల లాజర్, వర్కింగ్ ప్రసిడెంట్‌గా ముకుంద్‌రావు, ఉపాధ్యక్షుడిగా భరత్, హరీశ్, ప్రధాన కార్యదర్శులుగా రాజేశ్వర్, పరమేశ్వర్, జాయింట్ సెక్రటేరీగా రాములు, దేవానందం, విజయ్‌కుమార్, ప్రచార కార్యదర్శులుగా వేంకటేశ్, ప్రభాకర్, సభ్యులుగా రాజ్‌కుమార్, రవి, రోషన్, అజయ్, దివాకర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో దావుల రమేశ్, చంద్రయ్య, అవోక్, విజయ్, రమేశ్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

టీయూఎఫ్..


ఎన్నికైన సభ్యులు

నేరడిగొండ: తెలంగాణ ఉద్యమకారుల సంఘం (టీయూఎఫ్) నేరడిగొండ మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా జాదవ్ కపిల్‌దేవ్, కోకన్వీనర్లుగా గడ్డం మల్లేష్, షేక్ బాబా, కోశాధికారిగా ఆడెపు రమేశ్, ప్రధాన కార్యదర్శిగా రహీమ్, సంయుక్త కార్యదర్శులుగా ఏలేటి మోహన్ రెడ్డి, గంధం మోహన్, కుంట కిరణ్, మండల కార్యవర్గ సభ్యులుగా పచ్చు సింగ్ సాబ్లే, అప్సర్, రవి, సలీమ్, హనుమయ్యలను ఎన్నుకున్నారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ఉద్యమకారులను ఏకం చేసి భవిష్యత్ కార్యాచరణ ఏర్పాటు చేస్తామన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

ఎదులాపురం: జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం మాజీ జెడ్పీటీసీ రాందాస్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకుడు సీతారాం జాదవ్ కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, నాయకులు రాథోడ్ ప్రేమ్‌దాస్, సోమలాల్, విలాస్, గోపీచంద్, రాకేశ్ పాల్గొన్నారు.

తాంసి: భీంపూర్ మండలంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని కాంగ్రెస్ ఐఎన్‌టీయూసీ భీంపూర్ మండల అధ్యక్షుడు నరేశ్‌యాదవ్ కోరారు. ఆదివారం మండలంలోని గొన గ్రామంలో మండల నాయకులతో సమావేశమయ్యారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అనుసరించాల్సిన విధానాలపై చర్చించారు. ప్రస్తుతం కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. అందరు ఐక్యంగా ఉంటూ పార్టీని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకుడు కాశీం, సుదర్శన్, మనీష్ రెడ్డి, అమర్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాస్ రెడ్డి

మాల సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్


కమ్మరి శ్రీనివాస్

తాంసి: తాంసి మండల మాల సంఘం అధ్యక్షుడిగా తాంసికి చెందిన శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మాల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కమ్మరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ముచ్చ రఘు, ప్రధాన కార్యదర్శిగా కారం దేవదాస్, కోశాధికారిగా సూరం భూమన్న, ప్రచార కార్యదర్శిగా మధు జనరల్ సెక్రటరీలుగా అశోక్, మల్లయ్యతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అశోక్, శంకర్, రాజు, రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంత యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఏకలవ్య ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు రాంరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వాల్గొండ గ్రామంలో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను సర్పంచ్ కినక జుగాదిరావ్, గ్రామపెద్దలతో కలిసి ప్రారంభించారు. పొల్లుగూడ, ఖైర్‌గూడ, ఆంద్‌గూడ గ్రామాలకు చెందిన యువత కబడ్డీ పోటీల్లో పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంత యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తామన్నారు. గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామపటేల్ కినక లచ్చు, ఏలవ్య ఫౌండేషన్ సిబ్బంది ముత్యం, దిగంబర్, గ్రామస్తులు పాల్గొన్నారు.


కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న సభ్యులు

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మకు బోనాలు


బోనాలతో వెళ్తున్న గ్రామస్తులు

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలో ఆదివారం ఎల్లమ్మకు భక్తిశ్రద్ధలతో ఆదివారం బోనాలు సమర్పించారు. గ్రామస్తులు, మహిళలు మంగళ హారతులతో డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా ఎల్లమ్మ ఆలయానికి చేరుకున్నారు. అనంతరం నైవేద్యాలను సమర్పించారు. సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నారు.

కనుల పండువగా భోగి

నేరడిగొండ: భోగి పండుగను మండల వ్యాప్తంగా ఆదివారం కనుల పండువగా జరుపుకున్నారు. పలు గ్రామాల్లో భోగి మంటలు వేసుకొని ఆనందం గడిపారు. యువకులు, చిన్నారులు గాలిపటాలను ఎగురవేశారు. మహిళలు ఉదయం ఇంటి ఎదుట రంగురంగుల ముగ్గులు వేశారు. పట్టణాల నుంచి గ్రామాలకు ప్రజలు చేరుకోవడంతో పండుగ వాతావరణం నెలకొంది.

ఆదిలాబాద్‌రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం మావల గ్రామవార్డు మెంబర్ కొర్రి భుమేష్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈపోటీలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బచ్చువార్ స్వాతి, లావణ్య, నాగమణి, సర్పంచ్ దొగ్గలి ప్రమీలా, తదితరులు పాల్గొన్నారు.



వాంకిడిలో గాలిపటాలతో యువకులు

వైద్యుల్లో ఆణిముత్యం అడే అరవింద్

నార్నూర్: మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తూ.. స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ అడే అరవింద్ వైద్యుల్లో ఆణిముత్యమని జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని దుర్గానగర్‌లో గ్రామస్తులు, ఉద్యోగస్తులు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అడే అరవింద్ దంపతులను సన్మానించారు. ఏజెన్సీ ప్రాంతంలో పుట్టి పెరిగి ఉన్నత చదువులు చదువుకొని కార్పొరేట్ స్థాయిలో ఆసుపత్రిని నిర్మించి వైద్య సేవలు అందిస్తున్నారని కొనియాడారు. తన సోదరుడు అడే అరుణ్ పేరుతో అరుణ్ మెమోరియల్ ట్రస్టు ఏర్పాటు చేసి పేదలకు సేవ చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, మేడ్చల్ మేజిస్ట్రేట్ రాథోడ్ అజయ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, తిప్పేస్వామి, గణేశ్ రాథోడ్, పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్ పాల్గొన్నారు.


అరవింద్ దంపతులను సన్మానిస్తున్న జెడ్పీచైర్మన్

సేంద్రియ బొప్పాయి




జిల్లా కేంద్రంలోని జిల్లా జైలులో సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన బొప్పాయి పండ్లను విక్రయిస్తున్నట్లు జైల్ సూపరింటెండెంట్ అశోక్ తెలిపారు. తైవాన్ రెడ్ లేడీ రకం అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. రూ.40 కిలో చొప్పున అమ్ముతున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజు ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, గాంధీ పార్కు ప్రాంతాల్లో వాహనంలో విక్రయించడం జరుగుతుందని, వీటి సాగును జిల్లా హార్టికల్చర్ అధికారి శ్రీనివాస్ రెడ్డి పలుసార్లు పరిశీలించడం జరిగిందని, పండ్లకు ఎలాంటి రసాయనాలు చల్లకుండా చెట్టుపై పండిన పండ్లను విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. – ఆదిలాబాద్‌టౌన్